సాక్షి
విజయనగరం

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



రాష్ట్రం కోసం చంద్రబాబు చేసింది శూన్యం

-IIలో

రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం చంద్రబాబునాయుడు చేసింది శూన్యమని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు.

బూత్ స్థాయి ఏజెంట్లను వెంటనే నియమించాలి

విజయనగరం అర్బన్: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను వెంటనే నియమించాలని డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఓటర్ల సవరణ ప్రక్రియపై తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 7 నియోజక వర్గాల్లో చేర్పులు మార్పులు తర్వాత ప్రస్తుతం 15,71,427 మంది ఓటర్లు ఉన్నట్టు వెల్లడించారు.

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



రాజాం సిటీ: బొద్దాం ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలోని శివలింగాన్ని మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో భానుడి లేలేత కిరణాలు స్పర్శించాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించిన భక్తులు పరవశించిపోయారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఎక్కడ 'బాబూ'?



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం మళ్లీ మోసం చేసిందని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. సూపర్ సిక్స్–సూపర్ హిట్ అంటూ సభలు నిర్వహిస్తున్న చంద్రబాబుకు నిరుద్యోగ భృతి అంశం పట్టడంలేదని మండిపడ్డారు. విజయనగరంలోని డీఎస్ఆర్ అమర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 నెలలు కూటమి పాలనలో నిరుద్యోగ భృతి గల్లంతయ్యిందన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి వలంటీర్లు, రేషన్ సిబ్బందిని తొలగించారని విమర్శించారు. రాష్ట్రంలో 1.56 కోట్ల మంది నిరుద్యోగులు ఉండగా, విజయనగరం జిల్లాలోనే 4.68 లక్షల మంది ఉన్నారన్నారు. నారా లోకేశ్ విద్యాశాఖ మంత్రిగా వ్యవహరించకుండా కార్పొరేట్‌లకు సీఈఓలా ఉన్నారని విమర్శించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ వైద్య విద్యను దూరం చేసే కుట్రలో భాగంగా పీపీపీ మోడల్ ద్వారా వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడం అన్యాయమన్నారు. రాష్ట్రానికి బీజేపీ–టీడీపీ కూటమి ఏం చేసింది అనే అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. నవంబర్ చివరి వారం నుంచి హిందూపురం–ఇచ్ఛాపురం వరకు నిరుద్యోగుల ఆవేదన యాత్ర నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, జిల్లా నాయకులు వాసు, అప్పన్న, కిరణ్, గోపినాయుడు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి రైల్వే ట్రాక్ పక్కన ఎండబెట్టిన మొక్కజొన్న గింజలు

అమ్ముకోలేక.. ఉంచుకోలేక..

ఓ వైపు ప్రకృతి, మరోవైపు కూటమి సర్కారు రైతన్నపై పగబట్టాయి. మొక్కజొన్న, పత్తి రైతులను నట్టేటముంచాయి. పంట చేతికొచ్చేవేళ కురిసిన తుఫాన్ వర్షాలతో పంట తడిసి ముద్దయింది. పంట సేకరణ, రక్షించుకునేందుకు పెట్టుబడి తడిసిమోపెడవుతోంది. వచ్చిన అరకొర పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేవు. ఏర్పాటుచేసే చర్యలు కూడా కనుచూపుమేర కనిపించడం లేదు. దళారులు అడిగిన ధరకే పంటను విక్రయించాల్సిన పరిస్థితి. కొందరు రైతులకు పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోతున్నారు. గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత పంటల బీమా పథకానికి చంద్రబాబు ప్రభుత్వం మంగళం పాడేయడంతో ఆర్థికంగా ఆదుకునే మార్గం మూసుకుపోయిందంటూ రైతులు గగ్గోలుపెడుతున్నారు.

- అయోమయంలో మొక్కజొన్న, పత్తి రైతులు
- చేతికందిన పంటను అమ్ముకునేందుకు అగచాట్లు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఊసెత్తని కూటమి సర్కారు
- ఆవేదనలో రైతన్న
- అకాల వర్షాలకు తడిసి ముద్దవుతున్న పంట
- అమ్ముకునేదారిలేక.. కళ్లాల్లో పంటను ఉంచలేక ఇబ్బందులు
- కొన్నిచోట్ల తక్కువ ధరకే దళారులకు అమ్మకం
- మద్దతు ధర లేక తూకంలోనూ, ధరల్లోనూ నష్టపోతున్న రైతులు

బొబ్బిలి:

పంట ఆరంభంలో వర్షాభావంతో మొదలైన పత్తి, మొక్కజొన్న రైతుల కష్టాలు.. తుఫాన్ వర్షాలతో నష్టాల ఊబిలోకి నెట్టేశాయి. పంట చేతికొచ్చే వేళ కురిసిన వర్షాలు తడిసిముద్దచేశాయి. రైతన్నకు క(న)ష్టం మిగిల్చాయి. మిగిలిన అరకొర పంటను మద్దతు ధరకు అమ్ముకుందామంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేవు. వేలాది రూపాయలు పెట్టుబడితో సాగుచేసిన పంట చేతికొచ్చిందనే సంతోషం రైతులకు దూరమైంది. రైతు కుటుంబాలకు మొక్కజొన్న గింజలు, పత్తిని ఆరబెట్టడం, వర్షానికి తడిసిపోకుండా టార్పాలిన్లతో కప్పడమే పనిగా మారింది. సరిగా పంట ఎండకపోవడంతో కొన్నిచోట్ల రంగు మారింది. ఇదే అదునుగా దళారులు చౌకగా పంటను దోచుకుంటున్నారు. రైతన్నకు నష్టాన్ని మిగుల్చుతున్నారు. ఇవన్నీ తెలిసినా రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడం ఆవేదన కలిగిస్తోంది.

మద్దతు ధర కరువు

జిల్లాలో వివిధ పంటలతో పాటు ఈ ఏడాది మొక్కజొన్న, పత్తి పంటల సాగు విస్తీర్ణంతో పాటు ఉత్పాదకత పెంచేందుకు జిల్లా అధికార యంత్రాంగం లక్ష్యాలు విధించింది. పంట సాగును ప్రోత్సహించింది. గతేడాది జిల్లా వ్యాప్తంగా 9,600 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగుకాగా, ఈ ఏడాది 12,100 హెక్టార్లకు పెరిగింది. పత్తి పంట గతేడాది విస్తీర్ణం 1800 హెక్టార్లకు తగ్గకుండా చర్యలు చేపట్టింది. వర్షాలకు జిల్లాలో సుమారు 10వేల హెక్టార్లలో పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్టు రైతులు చెబుతున్నారు. పత్తి క్వింటా కనీస మద్దతు ధర రూ.9వేల పై చిలుకు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం దళారులు రూ.6వేలకు కొనుగోలు చేస్తున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో రైతులను అకాల వర్షాలు ముంచెత్తుతుంటే కూటమి ప్రభుత్వం ఆదుకోకపోవడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు.



అకాల వర్షానికి టార్పాలిన్లు కప్పిన రైతులు



బొబ్బిలిలో ఆరబెట్టిన పత్తి పంట



నా పేరు సింగిరెడ్డి వెంకటరమణ. బొబ్బిలి మండలంలోని ఎం.బూర్జివలస గ్రామం. సుమారు రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. రూ.60వేల వరకు పెట్టుబడి అయ్యింది. అకాల వర్షాలతో పంట తడిసి ముద్దయింది. వచ్చిన పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రం లేదు. మద్దతు ధర కోసం చూస్తే వర్షాలకు పంట తడిసి మొలకలు వచ్చాయి. కేవలం రూ.10వేలకు దళారులకు పంటను అమ్మేశాను. రూ.50వేలు నష్టపోయాను. గతంలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ఉండేది. విపత్తుల వేళ ఆదుకునేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రైతన్నకు గడ్డుకాలం ఇది.

కొనుగోలు కేంద్రాలేవీ?

పంట సీజన్ సమయంలో పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో రైతులు గగ్గోలుపెడుతున్నారు. కూటమి తీరుపై భగ్గుమంటున్నారు. ఇదే అదునుగా విజయనగరం, నెల్లిమర్ల, గజపతినగరం, చీపురుపల్లి, బొబ్బిలి, ఎస్.కోట, రాజాం నియోజకవర్గాల్లో దళారులు రంగప్రవేశం చేసి పంట రంగుమారిందంటూ తక్కువ ధరకే దోచుకుంటున్నారు. మొక్కజొన్న గతేడాది క్వింటా రూ.2,100లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు కొన్నిచోట్ల రూ.1900లకే కొనుగోలు చేస్తున్నారు. పండించిన పంటను దాచుకోలేక, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక దళారులకే పంటను తక్కువ ధరకు విక్రయిస్తూ రైతులు నష్టపోతున్నారు.

తడిసిన పత్తి, మొక్కజొన్న

తెర్లాం: మండలంలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా మొక్కజొన్న, పత్తి పంటలను సాగుచేసిన రైతులకు ఇక్కట్లు తప్పడంలేదు. రెండు రోజుల కిందట కురిసిన తుఫాన్ వర్షాలతోపాటు, సోమవారం ఉదయం కురిసిన వర్షానికి ఆమిటి, ఎం.ఆర్ అగ్రహారం, వి.చిన్నయ్యపేట, చుక్కవలస, నెమలాం, కొరటాం, గొలుగువలస తదితర గ్రామాల్లో రోడ్లపైన, కల్లాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న గింజలు, కండెలు తడిసి ముద్దయ్యాయి. వీటిని మంగళవారం ఉదయం నుంచి ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

పరిహారం ప్రకటించాలి



మొక్కజొన్న పంట మద్దతు ధరకు కొనుగోలుచేసే నాథుడే లేడు. కనీస ధరకూడా ఇవ్వడం లేదు. దళారులు క్వింటా రూ.1900లకే దోచుకుంటున్నారు. తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. రైతుకు కష్టం కూడా రావడంలేదు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటుచేయాలి. మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ప్రకటించి ఆదుకోవాలి.

– బంకురు సన్యాసి నాయుడు, దొంకినవలస, బాడంగి మండలం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

రాష్ట్ర ప్రభుత్వం పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదేశిస్తే వెంటనే కేంద్రాలు తెరుస్తాం.

– వెంకటేశ్వరరావు, డీఎం, మార్క్‌ఫెడ్ విజయనగరం



ఆమిటి వద్ద తడిసిన మొక్కజొన్న గింజలను ఎండబెట్టేందుకు సిద్ధంగా ఉంచిన రైతులు



తడిసిన పత్తిని కూనాయవలస–ఉత్తరావల్లి రోడ్డుపై ఎండబెట్టిన రైతులు

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు

- శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ

విజయనగరం: విశాఖ ఉక్కు కర్మాగారం ఆంధ్రుల హక్కు అని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు ఉద్యమం ప్రారంభమై 59 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అంబేడ్కర్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను విజయనగరంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత, దళిత సామాజికవర్గానికి చెందిన తాడికొండ మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృతరావు స్ఫూర్తిని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కొనసాగిస్తూ ప్రైవేటీకరణను విరమించుకోవాలని హితవుపలికారు. 2025 ఆగస్టు 16న విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని 32 విభాగాలను ప్రైవేటీకరణకు టెండర్లు పిలవడం, అదే రోజున ప్యాకేజీ ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 32 మంది ప్రాణత్యాగంతో సాకారమై, నేడు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు.

ఎన్నికలకు ముందు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని నేడు ప్రైవేటీకరణకు పాటుపడడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బి.భానుమూర్తి, ప్రతినిధులు పిడకల ప్రభాకరరావు, ధారాన వెంకటేష్, డోల కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, జామి కృష్ణ, చంద ఉమామహేశ్వరరావు, వంక చిన్నికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, అంబేడ్కర్ రైట్స్ ఫోరం సభ్యులు

చెప్పుకోలేను.. విప్పుకోలేను..



- అందుకే విజయనగరం నుంచి వెళ్లిపోతా...?
- మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య ఆవేదన

సాక్షిప్రతినిధి, విజయనగరం:

టీడీపీ నాయకులకు సొంత తెలివితేటలు లేవు.. చెబుదామంటే అర్థం చేసుకునే ఓపిక లేదు.. నా కష్టాలు బయటకు చెప్పుకోలేను.. లోలోపల దాచుకోలేను.. ఎందుకొచ్చిన బాధ.. సంచిసర్దుకుని వేరే ఊరు వెళ్లిపోతాను అంటూ మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య లోలోన కుమిలిపోతున్నారట. వాస్తవానికి విజయనగరం మున్సిపల్ కౌన్సిల్‌లో తెలుగుదేశానికి అసలు బలమే లేదు. మేయర్... డిప్యూటీ మేయర్, ఇంకో డిప్యూటీ మేయర్... స్టాండింగ్ కౌన్సిల్ చైర్మన్ వంటి అన్ని పదవుల్లోను వైఎస్సార్‌సీపీ నాయకులే ఉన్నారు. నగరంలో ఏ అభివృద్ధి కార్యక్రమాలు జరగాలన్నా.. ఖర్చుతో కూడిన ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. ఈ విషయంలో కౌన్సిల్ నిర్ణయమే అంతిమం. కౌన్సిల్‌లో తెలుగుదేశానికి పూర్తిగా బలం లేకపోవడంతో కేవలం ఎమ్మెల్యే పదవి మాత్రమే ఉన్న టీడీపీ ఆ ఒక్క పదవి పేరు చెప్పి అడ్డదిడ్డమైన నిర్ణయాలకు కమిషనర్ మీద ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. దీంతో ఆయన మేనేజ్ చేయలేక అసలు విషయం అర్థం అయ్యేలా చెప్పలేక సతమతమై బదిలీకి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

చందాల వసూళ్లలోనూ ఒత్తిడి

పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి కమిషనర్ జోక్యం చేసుకొని రూ.15 లక్షలకు పైగా వసూలు చేసి ఇచ్చారు. టౌన్ ప్లానింగ్ అధికారులు.. మున్సిపల్ హెల్త్.. ఎన్విరాన్మెంట్ విభాగం వారితో ఒత్తిడి చేయించి మరీ డబ్బులు వసూలు చేశారు. ఈ అంశంలోనూ కమిషనర్ బాగా ఇబ్బంది పడినట్టు తెలిసింది. ఇలాంటి పలు పరిణామాలు కమిషనర్‌ను ఇక్కడి నుంచి బదిలీ వైపు పురిగొల్పుతున్నాయన్న చర్చ సాగుతోంది.

పీఏ పోరు పడలేక..

మరోవైపు ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతోపాటు ఆమె పీఏ కూడా అలవిమాలిన పెత్తనం చేస్తూ ఒత్తిడి తెస్తుండడంతో వారు చెప్పిన పనులు చేయలేక కౌన్సిల్‌లో వాటిని నెగ్గించలేక కమిషనర్ నల్లనయ్య ఇరకాటంలో పడిపోతున్నట్టు తెలిసింది. కౌన్సిల్‌లో తీర్మానం లేకుండా ఏ ఒక్క పని కూడా చేయడం సాధ్యం కాదన్నది అందరికీ తెలిసిందే. అయితే ఎమ్మెల్యే పదవి తమది కాబట్టి కౌన్సిల్ నిర్ణయాలను పక్కనపెట్టి మౌఖికంగా చెప్పే ఆదేశాల పాటించాలంటూ టీడీపీ నాయకులు చేస్తున్న ఒత్తిడిని ఆయన భరించలేకపోతున్నారు. ఇటు వైఎస్సార్‌సీపీ అటు టీడీపీ మధ్య నలిగిపోయి ఇబ్బంది పడడం కంటే వెళ్లిపోవడం మేలని ఆయన భావిస్తున్నారని తెలిసింది. ఇదే విషయం టీడీపీ పెద్దల వద్ద ప్రస్తావించగా.. ఉంటే ఉండండి పోతే పొండి అన్నట్లుగా మాట్లాడారని మున్సిపల్ వర్గాలు చెబుతున్నాయి.

కమిషనర్ మనస్తాపానికి ఇవేనా కారణం?

ఇటీవల కాలంలో నగరంలో పలు రోడ్ల విస్తరణలో ఇల్లు, షాపులు కోల్పోయిన వారికి ప్రభుత్వం టీడీఆర్ లు ఇస్తుంది. ఆ సర్టిఫికెట్లను సదరు జాగాలు కోల్పోయిన వాళ్లు బయట ఎవరికైనా విక్రయించి తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చు. ఉదాహరణకు రోడ్డు విస్తరణలో 50 గజాలు కోల్పోయిన వారికి రెట్టింపు పరిహారం ఇస్తారు. అంటే వంద గజాల స్థలం కోల్పోయినట్లు సర్టిఫికెట్ ఇస్తారు. దానిని సదరు బాధితులు వేరే బిల్డర్లకు విక్రయించుకుని తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చు. అయితే, ఇదే క్రమంలో రోడ్డు విస్తరణలో సింహాచలం మేడ, లోయర్ ట్యాంక్ బండ్, కోట వద్ద మాన్సాస్ సంస్థ స్థలాలు కొంతమేర కోల్పోగా వీటికి టీడీఆర్ ఇచ్చే విషయంలో కమిషనర్‌తో పేచీ వచ్చినట్లు తెలుస్తోంది. ఇది ఆయనను బాగా ఇబ్బంది కలిగించినట్టు సమాచారం



పెద్ద చెరువులో తెప్పోత్సవం



ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న ఆలయ సహాయ కమిషనర్ శిరీష

హంసవాహనంపై సిరుల తల్లి

- కనులపండువగా పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం
- అమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- వనంగుడిలో పైడితల్లికి స్నపనం
- పెద్దచెరువులో మూడుసార్లు జలవిహారం

విజయనగరం టౌన్:

మంగళవాయిద్యాలు... బాణసంచా వెలుగులు.. భక్తుల జై పైడిమాంబ.. జైజై పైడిమాంబ జయజయధ్వానాలు.. వేదపండితుల మంత్రోచ్ఛరణాల నడుమ హంస వాహనంపై పసిడి కాంతుల పైడితల్లి విజయనగరం పెద్ద చెరువులో మంగళవారం సాయంత్రం జలవిహారం చేశారు. భక్తులకు చల్లని ఆశీస్సులు అందించారు. అమ్మవారి జలవిహారాన్ని చూసేందుకు సున్నంబట్టీ వీధి సమీపంలోని చెరువు గట్టు వద్దకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారు సాక్షాత్కరించిన చెరువులో మూడుసార్లు జలవిహారం చేస్తుంటే.. గట్టుపై ఉండి కళ్లార్పకుండా తిలకించారు. పైడితల్లమ్మా.. చల్లంగా చూడమ్మా అంటూ స్మరించారు. చల్లని తల్లి కరుణాకటాక్షాలను అందుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు సాగిన తెప్పోత్సవానికి జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయగా, ఆలయ ఇన్‌చార్జి ఈఓ కె.శిరీష పర్యవేక్షించారు.

వనంగుడిలో వేదస్వస్తి

వనంగుడిలో ముందుగా వేదపండితులు వేదస్వస్తి నిర్వహించారు. రాజాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి, అధికార భాషా సంఘం పూర్వపు సభ్యులు డాక్టర్ ఎ.గోపాలరావు వ్యాఖ్యానం చేశారు. వేదస్వస్తి చెప్పిన బ్రాహ్మణులకు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష దుశ్శాలువ, నగదు బహుమతితో సత్కరించారు. అనంతరం అమ్మవారికి పారాయణం, ఆధ్యాత్మిక అంశాలను, పైడితల్లి అమ్మవారి భజనలను వినిపించారు.



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తిరువీధిగా పెద్దచెరువుకు తీసుకువస్తున్న భక్తులు

పైడితల్లికి స్నపనం

తెప్పోత్సవానికి ముందు పైడితల్లి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వనంగుడిలో ఆలయ అధికారులు, పైడితల్లి దీక్షాపరులు స్నపన కార్యక్రమం నిర్వహించారు. వేదమంత్రాల సాక్షిగా పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి ఆలయం చుట్టూ మూడుమార్లు ప్రదిక్షణ జరిపారు. అనంతరం పల్లకిలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి, భాజాభజంత్రీలు, మేళతాళాలతో భారీ ఊరేగింపుగా సున్నంబట్టివీధి మీదుగా పెద్దచెరువు వద్దకు తెప్పోత్సవానికి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న హంసవాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి జలవిహారం జరిపించారు. ఉత్సవంలో ఆలయ సిరిమాను అర్చకులు బంటుపల్లి వెంకటరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఉత్సవ ప్రత్యేకాధికారి మూర్తి, దీక్షాపరులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

కనిపించని ప్రజాప్రతినిధులు

పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవానికి జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. కేవలం ఈఓ, సిరిమాను పూజారికే ఈ ఏడాది ఉత్సవం మిగిలింది. ఏటా కనీసం ఐదారుగురైనా అధికారులు ఉత్సవంలో పాల్గొని, అమ్మ ఆశీస్సులందుకుంటుంటారు. ఈ ఏడాది అన్నింటికీ మించి తెప్పోత్సవం ఎవరికీ పట్టకుండా పోయింది. అయినప్పటికీ పైడితల్లి అమ్మవారికి శాస్త్రోక్తంగా చేయాల్సిన కార్యక్రమాలన్నింటిని భక్తిశ్రద్ధలతో ఆలయ అధికారులు నిర్వహించడం విశేషం.



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

క్లుప్తంగా

ఆడపిల్లల పట్ల వివక్ష కూడదు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్లల పట్ల వివక్ష చూపకూడదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. జీవన రాణి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి మంగళ వారం సాయంత్రం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్ల అయినా, మగ పిల్ల వాడు అయినా ఇద్దరినీ సమానంగా చూడాల న్నారు. ఆడపిల్లలు కూడా పురుషులతో సమా నంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డెమో చిన్న తల్లి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడలకు ఎం పికైనట్లు హెచ్‌ఎం వి.వెంకటరావు తెలిపారు. ఈ నెల 6 నుంచి 8 వరకు శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన క్రీడల్లో పరు గుపందెలో అండర్ 19 విభాగంలో కె.దిలీప్‌కు మార్, జి.సంతోష్, ఎం.అరుణ్‌కుమార్, జి.జ్యోత్స్న, పి.కుసుమ, ఎస్.కల్పన, ఎ.జానీ న్లు, ఖో-ఖో క్రీడలో పి.లిఖిత్, అండర్ 17 బేస్‌బాల్ విభాగంలో కె.రాజేంద్ర మంచి ప్రతిభ చూపించి రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. వారిని మంగళవారం పాఠశాలలో హెచ్ ఆధ్వర్యంలో మంగళవారం అభినందిం చారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ కె.సూర్య నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య



సంతోష్ మృతదేహం

సంతకవిటి: మండలంలోని బిల్లాణి గ్రామానికి చెందిన కరణం సంతోష్(28) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై మృ తుడి తండ్రి నారాయణరావు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఎం.వాసుదేవ రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సం తోష్‌కు ఓ చెల్లి ఉంది. ఆమెకు కుటుంబసభ్యు లు ఇటీవల పెళ్లి సంబంధం చూశారు. ఈ సంబంధం కుటుంబానికి నచ్చింది. సంతోష్‌కు ఈ సంబంధం నచ్చకపోవడంతో సోమవారం పొలంలో గడ్డి మందు తాగేయగా కుటుంబస భ్యులు గమనించి చికిత్స నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బంగారు నగల దోపిడీ

పాచిపెంట: మండలంలోని సారాయి వలస ఏకలవ్య పాఠశాల మహిళా ఉపాధ్యాయు రాలికి చెందిన బంగారు నగలను ఇద్దరు దుం డగులు దోపిడీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏకలవ్య పాఠశాలలో మ్యూజికల్ టీచర్‌గా పనిచేస్తున్న శతిభజన్త్రి(ఢి ల్లీ) ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమ యంలో స్టడీ అవర్ ముగించుకుని సాలూరు లో తాను అద్దెకు ఉంటున్న నివాసానికి కారుపై వెళ్తుండగా మోసూరు జంక్షన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు దుండగులు వచ్చి కారును ఆపి ఉపాధ్యాయురాలి మెడలో ఉన్న నగను, చేతికి ఉన్న బంగారు గాజులు అపహ రించుకు పోయారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయ గా సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కృపారావు మంగళవారం తెలిపారు.

చంద్రబాబు చేసింది శూన్యం

- రూ.1.19 వేల కోట్లతో డిజైన్‌చేసిన అమరావతి ఎక్కడుంది?
- 2014లో మంజూరైన ఎయిమ్స్ కళాశాల పరిస్థితి ఏంటి?
- ఉచిత వైద్యం అందేవరకు పోరాటం చేద్దాం
- వైద్యకళాశాలల ప్రైవేటీకరణ దారుణం
- కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేద్దాం
- శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ



విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

చీపురుపల్లి(గరివిడి): రాష్ట్ర భవిష్యత్, ప్రజల ప్రయోజనాల కోసం సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా కొనసాగిన చంద్రబాబునాయుడు చేసింది శూన్యమని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్య నారాయణ విమర్శించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచన చేసినది దివంగత మహా నేత వైఎస్సార్ తరువాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. గరివిడిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించాలని, పేదలకు మెరుగైన వైద్యం, పేదలకు వైద్యవిద్య అందుబాటు లోకి రావాలని 2017లో అప్పటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే అప్పటికే ఎన్‌డీఏ కూటమిలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు కనీసం పట్టించుకోలేదన్నారు. 2019లో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి సవాల్ విసిరింద న్నారు. అయినప్పటికీ కరోనా బారి నుంచి ప్రజ లను రక్షించి, మరణాలు రేటు తగ్గించడంలో జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన దోహదం చేసిందన్నారు. ఆ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలల మంజూరుకు కృషిచేశారన్నారు. కేవలం మూడేళ్ల లోనే 5 కళాశాలల నిర్మాణాలు పూర్తిచేశారన్నారు. వీటి కోసం రూ.8 వేల కోట్లు అవసరం కాగా రూ.2,200 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. కేవలం మూడేళ్ల కాలంలో 17 వైద్య కళాశాలలు మంజూరు చేయడం సాధ్యమైతే 2014లో విభజన సమయం లో రాష్ట్రానికి మంజూరైన ఎయిమ్స్ కళాశాల ఇంత వరకు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. 2014లో రూ.1.19 వేల కోట్లతో డిజైన్ చేసిన అమ రావతి 2019 వరకు ఎంత మేర పనులు జరి గాయని ప్రశ్నించారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 19 నెలలు కాలంలో రూ.2 లక్షలు కోట్లు అప్పులు తెచ్చి రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్యం అందేవరకు పోరాటం చేద్దాం

కూటమి ప్రభుత్వం చేపడుతున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద కుటుంబాల విద్యార్థులు వైద్య విద్యకు, సామాన్య ప్రజలు వైద్యానికి దూరమవుతా రని, దీనిని ప్రజావ్యతిరేక కార్యక్రమంగానే పరిగణిం చి పోరుబాట సాగిద్దామని శాసనమండలి విక్షనేత బొత్స సత్యనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపుని చ్చారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేద్దామ న్నారు. సంతకాల సేకరణను వేగవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజా సంక్షేమం కానరావడంలే దన్నారు. ఇటీవల గుర్ల మండలం జమ్ము గ్రామంలో జరిగిన సంఘటన అత్యంత దారుణమని, భవిష్య త్తులో ఫలితం అనుభవిస్తారన్నారు.

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అనేది ప్రజావ్యతిరేక నిర్ణయమని, విద్య, వైద్యం అనేది ప్రజల హక్కు అని అన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకునేలా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టేలా జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశార న్నారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి కళాశాలల ప్రాముఖ్యతను వివరించి సంతకాలు సేకరించాల న్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం, వ్యవసాయం పూర్తిగా నిర్వీర్యం అవు తున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడం తో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ తప్పులను సోషల్‌మీడియా వేది కగా ఎండగట్టాలన్నారు. కోటి సంతకాల సేకరణ తరువాత ఈనెల 28న నియోజకవర్గ స్థాయిలో పెద్దస్థాయిలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు.
- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి హయాం లోనే విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం లభించిం దన్నారు. ఆరోగ్యశ్రీ నుంచి 108, 104, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ఎన్నో వైద్యసేవలు, విజయనగరంలో మెడికల్ కళాశాల అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వైద్యకళాశాలలను ప్రైవేటీకరిస్తూ కూటమి చేపట్టిన దుర్మార్గ పాలనను ప్రజలకు వివ రించి కోటి సంతకాలు సేకరించాలన్నారు. కార్యక్ర మంలో చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, వాకాడ శ్రీనివాసరావు, శీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసినాయుడు, ఎస్.వి.రమణరాజు, కోట్ల విశ్వే శ్వరరావు, తాడ్డి వేణు, నాలుగు మండలాల సర్పం చులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సుజుకి నూతన షోరూం ప్రారంభం



రింగ్ రోడ్డులో వేణుగోపాల్ సుజుకి రెండో శాఖను ప్రారంభించిన అభిషేక్ ఠాకూర్

విజయనగరం గంటస్తంభం: విజయనగరం పట్టణంలోని రింగ్ రోడ్డులో వేణుగోపాల్ సుజుకి సంస్థ తమ రెండవ షోరూమ్‌ను ప్రారం భించింది. మంగళవారం ఈ కొత్త శాఖను సుజుకి మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నేషనల్ హెడ్ అభిషేక్ ఠాకూర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుజుకి సంస్థ దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిందని, ఉత్త మమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. వేణుగోపాల్ సుజుకి సంస్థ విజయన గరంలో ఇప్పటికే ఒక శాఖను విజయవంతంగా నిర్వహిస్తోందని, వినియోగదారుల మద్దతుతో రెండో షోరూం ప్రారంభించడం ఆనందకరమ న్నారు. కార్యక్రమంలో బెస్ట్ వాల్యూ ఎస్ఎంఐపీ ఎల్ ఆపరేషన్స్ హెడ్ వీఎస్.యాస్ పాల్, వేణు గోపాల్ సుజుకి ఎండి జి.అభిరామ్, జీఎం సీహె చ్.ప్రవీణ్ కుమార్, సర్వీస్ మేనేజర్ సంతోష్ వర్మ, ఏరియా సేల్స్ మేనేజర్ ఎన్.సురేంద్ర, ఏరియా సర్వీస్ మేనేజర్ వి.సాయి కౌటిన్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు పుర్రె



ఇంటి ముందు బొట్లు పెట్టి ఉన్న మనిషి పుర్రె

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ పం చాయతీ పరిధి ఊడికిలపేట గ్రామంలోని పి.పై డమ్మ ఇంటి ముందు కుంకుమ, పసుపు రాసిన పుర్రెను గుర్తు తెలియని దుండగులు పెట్టారు. ఆల స్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధిం చిన వివరాలిలా ఉన్నాయి. ఎప్పటిలాగానే ఆదివారం రాత్రి పి.పైడమ్మ, కుటుంబసభ్యులు ఇం టిలో నిద్రించారు. సోమవారం తెల్లవారుజామున నిద్రలేచి ఇంటిలో నుంచి బయటకు వస్తుండగా ఇంటి ముందు మనిషి పుర్రె పెట్టి, దాని చుట్టూ కుం కుమ,పసుపు చల్లి ఉండడాన్ని గమనించిన వారు భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ సంఘ టనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు.

నరక యాతన పడి వ్యాన్ డ్రైవర్ మృతి

- మృతుడు తాడేపల్లి గూడెం వాసి



ఐషర్ వ్యాన్ బాడీకి, రేడియేటర్‌కు మధ్యలో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజు



డ్రైవర్ రాజును బయటకు తీస్తున్న స్థానికులు

వీరఘట్టం: ఐషర్ వ్యాన్‌లో ఉన్న గోనె సంచులను అన్‌లోడ్ చేసేందుకు వ్యాన్‌కు ఉన్న తాళ్లను విప్పుతూ ప్రమాదవశాత్తు వ్యాన్ బాడీకి-క్యాబిన్‌కు మధ్యలో పడిపోయిన డ్రైవర్ రాజు (35) వీర ఘట్టం మెయిన్ రోడ్డులో మంగళవారం మృతి చెం దాడు. ఈ ప్రమాదంపై ఎస్సై జి.కళాధర్‌తో పాటు స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక గోనె సంచుల వ్యాపారికి విజయవాడ నుంచి ఐషర్ వ్యాన్‌తో తాడేపల్లి గూడెంకు చెందిన రాజు అనే డ్రైవర్ గోనె సంచులను తీసుకువచ్చాడు. వ్యాన్‌లో ఉన్న గోనె సంచులను అన్‌లోడ్ చేసేందుకు గాను కలాసీలు రావడంతో వ్యాన్‌కు ఉన్న కట్లు విప్పేం దుకు డ్రైవర్ రాజు వ్యాన్ పైకి ఎక్కాడు.ఆ తాళ్లు విప్పుతూ ప్రమాదవశాత్తు వ్యాన్ బాడీకి-క్యాబిన్‌కు మధ్యలో ఉన్న సందులో పడిపోయాడు. ఈ ప్రమా దంలో డ్రైవర్ రాజు తలకిందులుగా వ్యాన్ బాడీకి రేడియేటర్‌కు మధ్యలో ఉండిపోయి నరకయాతన అనుభవించాడు. ఈ ప్రమాదాన్ని చూసిన కలాసీలు, స్థానికులు వెంటనే అతన్ని బయటకు తీసే ప్రయత్నం చేశారు. పక్కనే ఉన్న కొందరు మోటార్ వర్కర్లు కూడా వచ్చి వ్యాన్‌కు ఉన్న కొన్ని పరికరాలను కోసేసి డ్రైవర్ రాజును బయటకు తీయగా కొన్ని గాయాలతో బయట పడ్డాడు. మెల్లగా బయటకు వచ్చి కూర్చున్న డ్రైవర్‌కు కొద్ది క్షణాల్లోనే ఫిట్స్ వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపో యాడు. స్థానికులు సపర్యలు చేసి పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా వైద్యసిబ్బంది తనిఖీ చేసి చనిపోయి నట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంపై ఎస్సై జి.క ళాధర్ కేసు నమోదు చేశారు. వీరఘట్టం పీహెచ్ సీలో ఉన్న డ్రైవర్ మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి భద్రపరిచారు. మృ తుడి కుటుంబసభ్యులకు సమాచారం తెలియజే శామని, వారు వచ్చిన తర్వాత స్టేట్‌మెంట్లు రికార్డు చేసి పోస్ట్‌మార్టం అనంతరం బాడీని అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

గిలగిలాకొట్టుకోవడంతో కంట తడి

చుట్టూ వందలాది జనం..రోడ్డు పక్కనే ఉన్న వ్యాన్ వద్ద గిలగిలా కొట్టుకుంటూ డ్రైవర్ రాజు చేసిన ఆర్త నాదాలు స్థానికులను కంటతడి పెట్టించాయి. వ్యాన్ బాడీకి-క్యాబిన్‌కు మధ్య సుమారు 40 నిమిషాల పాటు ఇరుక్కపోయిన డ్రైవర్ రాజు మృ త్యువుతో పోరాడి బయటపడ్డాడని అందరూ అను కున్నారు. హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నా రు.అయితే బయటకు వచ్చిన క్షణాల్లోనే డ్రైవర్ చనిపోయాడని తెలియడంతో అక్కడ ఉన్నవారం తా తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే ఈ ప్రమాద విషయాన్ని వ్యాన్ యజమానికి ఫోన్‌లో తెలియజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన రాజు అనే డ్రైవర్ విజయవాడ నుంచి ఈ వ్యాన్ ఇక్కడికి తీసుకువచ్చినట్లు వ్యాన్ యజమాని పోలీసులకు తెలిపారు.ఈ విషయాన్ని డ్రైవర్ కుటుంబసభ్యు లకు పోలీసులు సమాచారం అందజేశారు.

ఏనుగుల బీభత్సం

- ధ్వంసమైన పంటలు
- వాపోతున్న రైతులు



అడ్డూరివలసలో ఏనుగులు ధ్వంసం చేసిన కొబ్బరి మొక్కలను చూపిస్తున్న రైతు శ్రీనివాసరావు



హిందూపురంలో ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన కొబ్బరి మొక్కలు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మోటార్



ఏనుగులు ధ్వంసం చేసిన కోకో పంట నిల్వలు



లోవగూడ సమీపంలో మకాం వేసిన ఏనుగులు మకాం

పార్వతీపురం రూరల్: మండలంలో కొన్ని రోజులుగా పలు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు స్వైరవిహారం చేస్తూ రైతుల జీవితాలతో చెల గాటమాడుతున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకుం టున్న పంటలను గజరాజులు నాశనం చేస్తుంటే, అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రైతులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మంగళవారం వేకువ జాము నుంచి పార్వతీపురం మండలంలోని రావికోన పంచాయతీ అడ్డూ హిందూ పురం గ్రామాలలో ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తూ బీభత్సం సృష్టించాయి.

రెండు గ్రామాల్లో అపార నష్టం

అడ్డూరివలస గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అనే రైతు కష్టమంతా ఏనుగుల పాలైంది. ఏపుగా పెరిగి పూత దశకు కొద్ది రోజుల్లో వచ్చే దాదాపు 200 కొబ్బరి మొక్కలను గజరాజుల గుంపు నేల మట్టం చేసింది. కాయకొచ్చిన కోకో తోటలను సైతం వదలకుండా నాశనం చేశాయి. సేకరించి ఉం చిన కోకో కాయలను ధ్వంసం చేసి తినేశాయి. అం తటితో ఆగకుండా, పొలంలోని మోటార్‌ను ధ్వం సం చేశాయి. అలాగే, మండలంలోని హిందూ పురం గ్రామంలో గుణ అనే రైతుకు చెందిన కొబ్బరి మొక్కలను ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. ఈ ప్రాంతంలో ఎప్పుడు ఏనుగుల గుంపు సంచరిస్తుం దో తెలియక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నా మని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిద్ర వీడాలి

ఏనుగుల బెడద నుంచి తమను కాపాడాలని రైతు లు, స్థానికులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి, ఏనుగుల దాడులను అరికట్టేందుకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తు న్నారు. అటవీ శాఖ అధికారులు కేవలం హెచ్చరిక లు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని, క్షేత్ర స్థాయిలో ఎటువంటి పరిష్కార చర్యలూ తీసు కోవడం లేదని ఆరో పిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం స్పందించి రైతులను ఈ విధంగా నష్ట పెట్టకుండా, తమ పంటలను ప్రాణాలను గజరాజుల బారి నుంచి రక్షించాలని కోరుతు న్నారు.

లోవగూడలో ఏనుగులు

భామిని: మండలంలోని లోవగూడ సమీపంలోకి మంగళవారం ఏనుగుల గుంపు చేరుకుంది. మొక్క జొన్న, వరి పంటలను తినివేస్తూ పాడు చేస్తున్నా యని గిరిజన రైతులు వాపోతున్నారు. ఏనుగులు సమీపంలోని మెట్టపై మకాం వేసినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

వైభవంగా పునర్వసు పట్టాభిషేకం

- సీతారామస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



స్వామి సన్నిధిలో పట్టాభిషేక పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం లోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పునర్వసు పట్టాభిషేక మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మంగళవారం వైభవంగా జరిపించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాం డ హవన హోమం జరిపించారు. అనంతరం స్వామి వెండి మంటపంలో సీతారామస్వామి కల్యా ణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి..ఉత్సవ మూర్తులకు రామాయణంలో పట్టాభిషేకం సర్గ విన్నవించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫల రసాలతో అభిషేకం, పునర్వసు పట్టాభిషేకాన్ని జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్ర మంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసిం హాచార్యులు, వర ప్రసాద్, రామ గోపాల్, తదితరు లు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ లిమిటెడ్, విజయనగరం
వేలం ప్రకటన

APSSDC

ఏపిసీడ్స్ విజయనగరం మరియు విశాఖపట్నం జిల్లాల ఆఫీస్‌ల అనుబంధ గోడౌన్‌లలో గల ఈ దిగువ తెలుపబడిన మొలకరాని విత్తనములు మరియు పాడైన 30kg, 25kg, 30kg మరియు 70kg సామర్థ్యము గల గోనెసంచులు మరియు ఇతర రద్దులు అమ్ముటకు ఏపిసీడ్స్ విజయనగరం మరియు విశాఖపట్నం వారు ఉద్దేశించుచున్నారు.

జిల్లా	పంట/రకము	పరిమాణం క్వింటాలో	వేలం తేదీ స్థలం
1. విజయనగరం	1. వివిధ రకములైన వరి (Paddy)	624.25	24.10.2025 ఏపి సీడ్స్ విజయనగరం ఆఫీస్ (గమనిక: 15.10.25 నుండి 24.10.25 వరకు అన్ని పనిదినములలో సదరు గోడౌన్‌లో సరుకులు తనిఖీ చేసి కొనగలరు)
	2. రాగి, మినుములు, పెసలు, కందులు నువ్వులు, వేరుశనగ, జనుము, పిల్లిపెసర సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న	15.17	
	3. వరి రద్దు	152.07	
	4. 30kg మరియు 70kg సామర్థ్యము గల రద్దు అయిన గోనెసంచులు	9972 No's	
2. విశాఖపట్నం	1. వివిధ రకములైన వరి (Paddy)	514.15	
	2. రాగి, మినుములు, పెసలు, వేరుశనగ మరియు వరి రద్దు	26.70	

ఆసక్తిగల బిడ్డర్లు / ప్రతినిధులు పైన తెలిపిన సరుకు నిమిత్తము టెండరుఫారం ధరావత్తు వివరములు, ఇతర నియమనిబంధనలు మరియు సరుకున్న ప్రదేశము కొరకు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు. విజయనగరం - 9849908741, విశాఖపట్నం - 7993454311 పైన తెలిపిన వేలం, ఎటువంటి కారణం తెలుపకుండ పూర్తిగా లేదా పాక్షికముగా ఆమోదించుటకు లేదా రద్దుచేయుటకు వైస్‌ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ గారికి పూర్తి అధికారము కలదు.

సం/- జిల్లా మేనేజర్, విజయనగరం

గెడ్డలో కొట్టుకుపోయిన వ్యక్తి

- గాలింపు చేపట్టిన ఎస్‌డీఆర్‌ఎఫ్



సోమరాజు కొట్టుకుపోయిన గెడ్డ



గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట గెడ్డ లో ఓ వ్యక్తి కొట్టుకుపోయాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఆర్.వసంత గ్రామానికి చెందిన విజ్జపు సోమరాజు విజయనగరం పీడబ్ల్యూ మార్కెట్‌లోని ఓ కిరాణా హోల్‌సేల్ దుకాణంలో పనిచేస్తు న్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించు కుని టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై గ్రామానికి వెళ్తుండగా చంద్రంపేట దాటిన తర్వాత వసంత గ్రామానికి ముందు ఉన్న గెడ్డలో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయాడు. రాత్రి 12 గంటలైనా సోమరాజు ఇంటికి రాకపోవడం తో కుటుంబసభ్యులు గ్రామ స్తులతో కలిసి వెతకసాగారు. తెల్లవార్లూ వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సాయికృష్ణ, తహసీల్దార్ నీల కంఠేశ్వరరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరు కుని ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి గాలింపు చేపట్టారు. గల్లంతైన సోమరాజుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గెడ్డపై ఇప్ప టికైనా పాలకులు వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ గెడ్డపై వంతెన నిర్మించాలని రెండు గ్రామాలకు చెందిన ప్రజలు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



విజయనగరం టౌన్: ఉత్తరాం ధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కె లు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మ వారు మంగళవారం పుష్పాలంకర ణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ అమ్మవారికి పంచామృతాల తో అభిషేకాలు, అర్చనలు నిర్వ హించారు. సిరిమాను పూజారి బం టుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్ లు పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కె.శిరీష పర్యవేక్షించారు.

19న జిల్లా స్థాయి యోగాసనాల పోటీలు

నెల్లిమర్ల: స్థానిక మిమ్స్ సమీపంలోని శ్రీరామకృష్ణ ధ్యాన మందిరంలో ఈ నెల 19వ తేదీన జిల్లా స్థాయి యోగసనాల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా క్రీడా సంఘం ప్రతిని ధులు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. మొత్తం ఏడు విభాగాల్లో పోటీలు ఉంటాయని, విజేతలను 25, 26వ తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపి స్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు తమ పేర్లను 17వ తేదీలోగా ఫోన్ నంబర్లు 8374904262, 8465954998 సం ప్రదించి నమోదు చేసుకోవాలన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- కష్టలెస్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసు కోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ:15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7995365999 [HA-506]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.